క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగుల విజయోత్సవం



విజయోత్సవ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు

పలాస: ఆర్టీసీ ఉద్యోగులకు 1/19 సర్క్యులర్‌ను అమలు చేయడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో పలాసలోని డిపో మెయిన్ గేటు వద్ద నేషనల్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం విజయోత్సవ గేట్ మీటింగ్‌ను నిర్వహించారు. సంస్థ ఎండీకి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ జోనల్ జాయింట్ సెక్రటరీ పినకాన వాలి, డిపో కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

కవిటిలో భారీ వర్షం



రోడ్డు పైనుంచి ఇళ్లలోకి చేరుతున్న వరదనీరు

కవిటి: కవిటి మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి వరదనీరు చొరబడడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. వడ్డిజల్లుపుట్టుగలో ఇటీవల సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే దీన్ని సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో వర్షం నీరంతా సమీపంలోని 20 ఇళ్లల్లోకి చొచ్చుకుపోవడంతో వారంతా ఆందోళన చెందారు. ఇళ్లల్లోకి వెళ్లిన నీటిని తోడుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

తెరుచుకున్న సచివాలయం



తెరుచుకున్న సచివాలయం తలుపులు

సాక్షి ఎఫెక్ట్...

మందస: మందస మండల కేంద్రంలోని రెండో నంబర్ సచివాలయం ఎట్టకేలకు తెరచుకుంది. 'సచివాలయానికి తాళం'శీర్షికతో ఈ నెల 22వ తేదీన 'సాక్షి'లో కథనం వచ్చింది. దీనికి స్పందించిన అధికారులు చర్యలు చేపట్టారు. సచివాలయంలో కరెంట్ ఇబ్బందుల వల్ల సేవలకు అంతరాయం కలిగిందని, ఇకపై ఇటువంటి ఇబ్బందులు రానీయమని పంచాయతీ ఈవో బమ్మిడి నవీన్ శుక్రవారం తెలిపారు. ఇకపై సచివాలయం-2 పరిధిలో కొత్త రేషన్‌కార్డులు, ఇతర సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

- జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి



మహిళ సమస్య వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కాశీబుగ్గ: ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వచ్చే వినతులను పూర్తి స్థాయిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులపై చట్టపరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని సిబ్బందికి సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఇచ్ఛాపురం: మద్యం దుకాణాల వద్ద నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ అధికారి పి.డి.ప్రసాద్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఆర్పీ కంటే అధిక ధరలకు మద్యాన్ని ఎవరైనా విక్రయిస్తున్నట్టు తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 14405కి ఫిర్యాదు చేయాలని సూచించారు.

సతాయిస్తున్న సర్వర్..!

- ఆన్‌లైన్ మధ్యలో నిలిచిపోతున్న సేవలు
- కొత్తరేషన్ కార్డులకు దరఖాస్తులు ఇక్కట్లు

ఇచ్ఛాపురం:

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. అయితే దరఖాస్తు ప్రక్రియలో తలెత్తే క్షేత్రస్థాయి సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో దరఖాస్తుదారులంతా ఆందోళనకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం హడావిడిగా రేషన్‌కార్డు ప్రక్రియను ప్రకటించినప్పటికీ కార్డు నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఫలితంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్తరేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని, రేషన్ కార్డులలో ఏవైన మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని.. ఈ ప్రక్రియ నెల రోజులు మాత్రమే కొనసాగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ప్రజల నుంచి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి.



ఇచ్ఛాపురంలో రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవడానికి వేచిఉన్న లబ్ధిదారులు

మధ్యలో నిలిచిపోతున్న సర్వర్..

ఇప్పటికే సచివాలయాల్లోని కంప్యూటర్లు, ప్రింటర్లు సక్రమంగా పనిచేయక సిబ్బంది చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సర్కార్ ఆదేశాలు జారీ చేయడంతో అధికసంఖ్యలో ప్రజలు దరఖాస్తు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. సచివాలయాలకు క్యూ కడుతున్నారు. దరఖాస్తుదారుల వివరాలను ఏపీసేవ ఆన్‌లైన్ పోర్టల్ యందు పొందుపరిచే సమయంలో సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో ఆ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోతుంది. సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో రోజూ సచివాలయాలకు రావలసి వస్తుండడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో దరఖాస్తుదారుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచే సమయంలో సర్వర్ సడన్‌గా ఆగిపోతుంది. దీంతో సచివాలయ సిబ్బందికి ఏమిచేయాలో.. దరఖాస్తుదారులకు ఏమి చెప్పాలో తెలియని అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఇచ్చే గడువు సమీపిస్తుండడంతో ప్రజలు ఆందోళన, ఒత్తిడులకు గురౌతున్నారు. రేషన్‌కార్డు నమోదు ప్రక్రియ రోజులో కనీసం రెండు, మూడు కూడా సక్రమంగా జరుగడం లేదంటే సర్వర్ పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రేషన్ కార్డుల ప్రక్రియలో తలెత్తె సర్వర్ల సమస్యపై జిల్లా అధికారులు చొరవ తీసుకొని సక్రమంగా పనిచేసేలా చూడాలని దరఖాస్తు దారులు కోరుతున్నారు.

సర్వర్ పనిచేయడం లేదు



రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేయడానికి సచివాలయానికి రోజూ రావలసి వస్తుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో సచివాలయంలో చాలా సమయం వేచి ఉన్నప్పటికి పని జరగడంలేదు. ఎందుకని సిబ్బందిని అడిగితే సర్వర్ సక్రమంగా పనిచేయడం లేదని చెబుతున్నారు. దీంతో మా సమయం వృథా అవుతుంది.

–కె.రమేష్, ఇచ్ఛాపురం

పనులు మానుకోవలసి వస్తుంది



మా రేషన్‌కార్డులో కొత్తగా సభ్యులను చేర్చేందుకు దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయం చుట్టూ తిరగవలసి వస్తుంది. వారం రోజులుగా సచివాలయానికి వస్తున్నాం. మేము చిన్నచిన్న పనులు చేసుకొని జీవిస్తున్నాం. పనులు మానుకొని రేషన్‌కార్డు కోసం రోజుల తరబడి రావలసి వస్తుంది. అయినప్పటికీ సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. అధికారులు దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

–ఎం.పొలారావు, ఇచ్ఛాపురం

అక్రమ మైనింగ్‌ను ఆపండి



అనుమతి లేకుండా తవ్విన గ్రానైట్ బ్లాకులు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం చిన్నసాన పంచాయతీ పరిధిలోని 340 సర్వే నంబర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా జరుపుతున్న అక్రమ మైనింగ్‌ను ఆపాలని సర్పంచ్ బి.పావని, వార్డు మెంబర్లు, పలువురు డి.పట్టా లబ్ధిదారులు కోరారు. ఈమేరకు శుక్రవారం కోటబొమ్మాళి తహసీల్దార్, జిల్లా కలెక్టర్, జిల్లా మైనింగ్అధికారి, మైనింగ్ విజిలెన్స్ డైరెక్టర్‌కు శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. కొండపై ఎలాంటి అనుమతుల్లేకుండా సారవకోట మండలానికి చెందిన వరుదు రాఘవ, తర్ర కృష్ణారావు, పొట్నూరు తిరుపతిరావు, కోరంగి విమలారావు, ఇట్టరాఘుల అప్పన్నలు భారీ యంత్రాలతో గ్రానైట్ బ్లాకులు తవ్వి సుమారు రూ.2 కోట్లు సొమ్ము చేసుకున్నారని తెలిపారు. దీంతో ప్రభుత్వానికి, పంచాయతీకి రావల్సిన ఆదాయం గండి పడుతుందన్నారు. అలాగే రాళ్లు తీస్తున్న ప్రాంతంలో ఏడుగురుకు 1998లో ప్రభుత్వం డి.పట్టా ఇచ్చినప్పటికీ వారికి ఎలాంటి పరిహారం ఇవ్వకుండా అక్రమణదారులు దౌర్జన్యంతో క్వారీ నిర్వహించి దోచుకుంటున్నారన్నారు. అక్రమ మైనింగ్ విషయం కొంతమంది అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు దీనిపై దర్యాప్తు నిర్వహించి ప్రభుత్వానికి, పంచాయతీకి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కుంభా రవిబాబుకు నాయకుల సన్మానం



కవిటి: రవిబాబును సన్మానిస్తున్న విజయ, సాయిరాజ్ తదితరులు



టెక్కలి: రవిబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తిలక్

కవిటి: వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబును ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ నియోజకవర్గ నేతలతో కలిసి శ్రీకాకుళంలో మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా సాయిరాజ్, విజయ దంపతులు రవిబాబును దుశ్శాలువతో సత్కరించారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను వివరించారు. పార్టీ నేతలు నర్తు నరేంద్రయాదవ్, సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, తడక జోగరావు, కడియాల ప్రకాష్ పాల్గొన్నారు.

రవిబాబును కలిసిన తిలక్

టెక్కలి: వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబును టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాంల సమక్షంలో తిలక్ ఆయనను కలిసి టెక్కలి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను వివరించారు.

వైభవంగా అమ్మవారి ఉత్సవం



కంచిలి మండలంలోని ఉద్దాన ప్రాంతమైన తలతంపర, కొక్కిలిపుట్టుగ, కొన్నాయిపుట్టుగ గ్రామాలకు సంబంధించిన గ్రామదేవత సింధుపటరాణి అమ్మవారి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. 19వ తేదీన ప్రారంభమైన ఉత్సావాలు తొమ్మిది రోజులు జరుగుతాయి. శుక్రవారం అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించగా.. భక్తులు ప్రజలు పూజలు చేశారు.

–కంచిలి

తహసీల్దార్‌కు అభినందనలు



మందస మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మిస్క శ్రీకాంత్‌ను స్థానిక దళిత, గిరిజన ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. మండలాభివృద్ధికి కృషి చేయాలని.. తమ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని వివరించారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో నగిరి కరుణాకర్, గువ్వ భీమారావు, గణేశ్వరరావు, అప్పారావు, అబ్రహం, గోపాలరావు, జ్యోతిశ్వరి, పాపమ్మ ఉన్నారు.

–మందస

ఆర్థికసాయం అందజేత..



ఇచ్ఛాపురం మండలం తులసిగాం గ్రామ పంచాయతీలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న భాగిరథీ బ్రెయిన్ స్ట్రోక్‌తో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. కుటుంబ పెద్ద మృతితో అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతుంది. ఈ విషయం తెలుసుకున్న తులసిగాం యువసేన ఫౌండేషన్ సభ్యులు స్పందించారు. రూ.28,100 సేకరించారు. ఈ మొత్తాని మృతుని కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేసి అండగా నిలిచారు.

–ఇచ్ఛాపురం రూరల్

తాగునీరు సురక్షితమేనా..?

- కాలం చెల్లిన వాటర్ ట్యాంకులు
- పరిశుభ్రతకు నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు



లీకవుతున్న కొళిగాం ఓపెన్ హెడ్ ట్యాంక్

ఇచ్ఛాపురం రూరల్: వేసవి కాలం అయినప్పటికీ చిన్నపాటి వర్షాలు కురుస్తుండటంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది. కలుషిత నీటితోనే వైరల్ ఫీవర్స్ వచ్చే అవకాశాలున్నాయి. ఈ సమయంలో నీటి ట్యాంకులను శుభ్రం చేయాల్సిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇచ్ఛాపురం మండలంలోని పలు ప్రాంతాల్లో పైపులు లీకేజీలు ఉండటంతో పైపులు సైతం పాకురుతో నిండిపోతున్నాయి. నెలలు గడుస్తున్నా శుభ్రం చేయని ట్యాంకుల ద్వారా వచ్చే నీటిని తీసుకోవడం ద్వారా పలు వ్యాధులకు గురౌతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆడపాదడపా కురుస్తున్న వర్షాలకు తాగునీరు రంగు మారుతోంది. బురద, పసుపు రంగుల్లో రావడంతో వాటిని తాగేందుకు ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. లీకేజీలతో పాటు ట్యాంకులు శుభ్రం చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందికరంగా మారింది.

శుభ్రత ఎక్కడ?

ప్రతీ వాటర్ ట్యాంక్‌ను కచ్చితంగా 15 రోజులకోసారి పూర్తిగా శుభ్రం చేసి ప్రజలకు నీరందించాల్సి ఉంటుంది. దీంతో పాటు ఏ రోజు శుభ్రం చేశాం, మళ్లీ ఏ రోజు శుభ్రం చేయాలనే తేదీల బోర్డు సైతం వాటర్ ట్యాంకుల వద్ద ఏర్పాటు చేయాలి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి మండలంలో ఎక్కడా కనిపించడం లేదు. సంబంధిత అధికారులు నిబంధనలు పాటించడం లేదు. దీంతో ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతుంది.

కాలం చెల్లిన ట్యాంకులు

బిర్లంగి, తేలుకుంచి, ధర్మపురం, తిప్పనపుట్టుగ, అరకబద్ర, కొళిగాం గ్రామ పంచాయతీలతో పాటు పలు గ్రామాల్లోని వాటర్ ట్యాంకులకు కాలం చెల్లాయి. తేలుకుంచి, బిర్లంగి గ్రామాల్లోని ప్రజలు కాలం చెల్లిన వాటర్ ట్యాంకులను పడగొట్టాలంటూ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో ఇటీవల వాటిని నేలమట్టం చేశారు. మిగతా గ్రామాల్లోని ట్యాంకులు శిథిలావస్థకు చేరుకొని లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ మంచినీటి ఓపెన్ హెడ్ ట్యాంకులను నేలమట్టం చేసి కొత్తవి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



లీకవుతున్న బూర్జపాడు-డొంకూరు మధ్య పైపులైన్

లీకేజీలు లేకుండా చేస్తాం



కొన్ని మంచినీటి ట్యాంకులు లీకేజీలు ఉన్నట్లు సమాచారం ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి మరమ్మతులు చేపడతాం. శిథిలావస్థకు చేరుకున్న తేలుకుంచి, బిర్లంగి ఓపెన్ హెడ్ ట్యాంకులను నేలమట్టం చేయడం జరిగింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో తాగునీరు కలుషితం కాకుండా సిబ్బందిని అప్రమత్తం చేశాం.ట్యాంకులు పరిశుభ్రం చేయడం పంచాయతీ అధికారుల పరిధిలో ఉంది.

– కూన విష్ణుమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఇచ్ఛాపురం

పైపులైన్‌కు మరమ్మతులు!



వృథాగా పోతున్న మంచినీరు

టెక్కలి రూరల్: స్థానిక గోపీనాథపురం సమీపంలో శుక్రవారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గోపినాథపురం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వైపు వెళ్లే మార్గంలో మూడు రోజుల క్రితం రహదారికి రంధ్రం ఏర్పడింది. దీంతో పోర్టుకు వెళ్లే భారీ వాహనాలతో పాటు మిగిలిన వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీన్ని సరి చేసేందుకు శుక్రవారం రహదారిలో ఒక్కవైపు మాత్రమే వాహనాల రాకపోకలు సాగించి జేసీబీ సహాయంతో రంధ్రం తవ్వేందుకు ప్రయత్నించారు. అయితే జేసీబీతో తవ్వుతున్న సమయంలో కింద నుంచి ఉన్న పైపు లైన్లను గమనించకపోవడంతో తవ్వేయడంతో అవి పగిలిపోయాయి. దీంతో భారీగా నీరు బయటకు వచ్చేసి వృథా అయింది. అలాగే మరమ్మతులు చేస్తున్న సమయంలో వాహనాలు ఒక్కవైపు నుంచే రాకపోకలు సాగించడం, పోర్టుకు వెళ్లే భారీ వాహనాలు సైతం వెళ్లడంతో ఆ రహదారికి మరో వైపు సైతం రంధ్రం ఏర్పడటంతో సమస్య తలెత్తింది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న గ్రామీణ నీటి సరఫరా అధికారులు చేరుకుని నీటి వృథాను అరికట్టే ప్రయత్నం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మోహన్ మాట్లాడుతూ.. పైపు లైన్ల మరమ్మతులు జరిగినంత వరకు తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు. తరువాత వెళ్లి చూడగా రెండు పైపు లైన్లు పూర్తిగా పాడైపోవడంతో వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. శనివారం పనులు పూర్తవుతాయన్నారు.


నవధాన్యాలతో భూమికి సారం

సోంపేట: నవధాన్యాల సాగుకు రైతులు ముందుకు రావాలని మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. నవధాన్యాల సాగుతో భూమి సారవంతం అవుతోందన్నారు. 'నవధాన్యాల సాగు-నేల తల్లిబాగు'కార్యక్రమంలో భాగంగా బారువ గ్రామంలో నవధాన్యాల కిట్లను తయారు చేసి రైతులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ.. నవధాన్యాలు సాగు చేయడం వలన నేలలో కర్బన్ శాతాలు పెరుగుతాయని, సాగుచేసే పంటలో మంచి దిగుబడులు వస్తాయని రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి కుమారి, సిబ్బంది తులసయ్య పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

నందిగాం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు నత్రజని స్థాపనకు ఉపయోగపడే పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ శుక్రవారం తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో వీటిని అందుబాటులో ఉంచామన్నారు. రాయితీపై వాటిని తీసుకోవచ్చని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు రూరల్: పల్లిసారధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం అపూర్వ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. గ్రూపుఫొటోలు తీసుకొని మురిసిపోయారు.

మూడు వందల సారా ప్యాకెట్లు స్వాధీనం

- ముగ్గురిపై కేసు నమోదు

కవిటి: గొర్లెపాడు జంక్షన్‌లో ఎక్సైజ్ మొబైల్ బృందం సభ్యులు శుక్రవారం ఆకస్మిక దాడులు చేశారు. దాడుల్లో అదే గ్రామానికి చెందిన కరగాన కృష్ణారావు 300 ఒడిశా సారా పాకెట్లతో పట్టుబడడంతో అతనిపై కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. ఇచ్ఛాపురం సర్కిల్ మొబైల్ టీం సీఐ జీవీ రమణ తన సిబ్బందితో దాడులు చేశారు. పట్టుబడిన వ్యక్తి నుంచి సారా ప్యాకెట్లతోపాటు వాటిని తరలిస్తున్న ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అతన్ని విచారించగా సారాయ ప్యాకెట్లను కవిటి మండలం బల్లిపుట్టుగ పంచాయతీకి చెందిన తలగాన బెన్ను, యర్ర భైరాగిలకు సరఫరా చేసేందుకు తీసుకెళుతున్నానని తెలపడంతో వారిద్దరిపై కూడా కేసు నమోదు చేశామని సీఐ జీవీ రమణ తెలిపారు.

నెహ్రూ పార్క్‌లో అక్రమ తవ్వకాలు!



పార్క్ ఆవరణలో తవ్వకాలు జరిపిన స్థలం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ముత్యాలమ్మకోనేరు (నెహ్రూ పార్కు)లో ఆక్రమణకు కొంతమంది యత్నించారు. ఈ విషయం సంచలనంగా మారింది. 20 ఏళ్ల క్రితం ఓ కుటుంబం సహకారంతో పార్కును ఏర్పాటు చేశారు. ఇప్పుడు జంట పట్టణాలలో స్థలం విలువ పెరిగిపోవడంతో గుట్టుచప్పుడుగా గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీతో సుమా 300 అడుగుల పొడవులో గట్టును సుమారు ఆరు అడుగులు తవ్వేశారు. పార్కులో వ్యాయాయం చేసేందుకు వెళ్లిన వాకర్స్‌క్లబ్ సభ్యులు తవ్వకాలు గుర్తించి తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తికి, మున్సిపల్ కమిషన్ రామారావుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ, మున్సిపాలిటీ సంయుక్తంగా సర్వేచేసి ఆరు అడుగులు ఆక్రమణ జరిగినట్లు నిర్ధారించి కొలత రాయి వేశారు.